అక్రమ వలసదారులపై కొరడా

- అమెరికాలో 500 మందికిపైగా అరెస్టు
- వందల మంది దేశం నుంచి బహిష్కరణ
- చర్యలు మొదలు పెట్టిన ట్రంప్ సర్కారు
- జన్మతః పౌరసత్వం రద్దు ఆదేశాన్ని తాత్కాలికంగా ఆపేసిన ఫెడరల్ కోర్టు
- డిపోర్టేషన్ భయాల నేపథ్యంలో పార్ట్‌టైమ్ ఉద్యోగాలు మానేస్తున్న భారత విద్యార్థులు

వాషింగ్టన్, జనవరి 24:తాను అధికారంలోకి వస్తే అక్రమ వలసదారులను సొంత దేశాలకు పంపిస్తానని, ఇందుకోసం అమెరికా చరిత్రలోనే అతిపెద్ద కార్యక్రమాన్ని చేపడతానని డొనాల్డ్ ట్రంప్ హామీ ఇచ్చినట్టుగానే ఇప్పుడు పని మొదలుపెట్టారు. మూడు రోజుల్లోనే అమెరికా అధికారులు 538 మంది అక్రమ వలసదారులను అరెస్టు చేశారని, వందలాది మంది సైనిక విమానాల్లో దేశం నుంచి పంపించేశారని వైట్ హౌజ్ ప్రెస్ సెక్రటరీ కరోలీన్ లీవిట్ తెలిపారు. అరెస్టు చేసిన అక్రమ వలసదారులు అనేక నేరాలకు పాల్పడ్డారని ఆమె చెప్పారు.

పార్ట్‌టైమ్‌కు రాంగ్ టైమ్

వలసదారులపై కఠినంగా వ్యవహరిస్తున్న అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీరు అమెరికాలోని భారతీయ విద్యార్థులను తీవ్ర కలవరపాటుకు గురి చేస్తున్నది. చదువుకుంటూ క్యాంపస్ బయట పార్ట్‌టైమ్ ఉద్యోగాలు చేసుకునే విద్యార్థులు ఆందోళనకు గురవుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా క్యాంపస్ బయట పని చేస్తూ అధికారులకు దొరికితే దేశం నుంచి పంపిస్తారని భయపడుతున్నారు. ఎఫ్-1(స్టూడెంట్) వీసాపై అమెరికాకు ప్రతియేటా లక్షలాది మంది భారతీయ విద్యార్థులు వస్తున్నారు. ఇందుకోసం తల్లిదండ్రులు దాదాపు రూ.30-40 లక్షలు ఖర్చు చేస్తున్నారు. అమెరికా వచ్చిన తర్వాత విద్యార్థులు తమ జీవన వ్యయం కోసం చదువుకుంటూ, ఏదో ఓ పార్ట్ టైమ్ ఉద్యోగం చేస్తుంటారు. అయితే, నిబంధనల ప్రకారం విద్యార్థులు యూనివర్సిటీ క్యాంపస్‌లోనే పార్ట్‌టైమ్ ఉద్యోగం చేయాలి.

అది కూడా వారానికి 20 గంటలకు మించి పని చేయొద్దు.

ఉద్యోగాలు వదులుకుంటున్న విద్యార్థులు

క్యాంపస్‌లో పార్ట్‌టైమ్ ఉద్యోగాలు చాలా తక్కువ సంఖ్యలో ఉంటాయి. పైగా వారానికి 20 గంటలే పని చేస్తే ఖర్చులకు డబ్బులు సరిపోవు. దీంతో విద్యార్థులు క్యాంపస్ బయట రోజుకు 6-8 గంటల పాటు పార్ట్‌టైమ్ ఉద్యోగాలు చేస్తున్నారు. ట్రంప్ రాకతో పని ప్రదేశాల్లో అధికారులు తనిఖీలు చేపడతారని, క్యాంపస్ బయట పని చేస్తూ దొరికితే దేశం నుంచి పంపిస్తారని భయపడుతున్నారు. 'కొత్త నిబంధనను ఇమిగ్రేషన్ అధికారులు కఠినంగా అమలు చేస్తారని విని ఉద్యోగం మానేశాను. రిస్క్ తీసుకోలేను' అని ఇలినాయీ యూనివర్సిటీ విద్యార్థి ఒకరు వాపోయారు. 'కొన్ని నెలలు పరిస్థితిని పరిశీలించిన తర్వాతే పార్ట్‌టైమ్‌లోకి చేరతాం. అప్పటివరకు అప్పు చేయడమో, తల్లిదండ్రులను డబ్బులు అడగడమో తప్పదు' అని న్యూయార్క్‌లో మాస్టర్స్ చేస్తున్న మరో విద్యార్థి చెప్పారు.

బహిర్గతం కానున్న కెనడీ హత్య రహస్యాలు

అమెరికా మాజీ అధ్యక్షుడు జాన్ ఎఫ్ కెనడీ హత్యకు సంబంధించిన రహస్యాలు బయటకు రానున్నాయి. ఆయనతో పాటు పౌర హక్కులకై పోరాడిన నాయకుడు మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్, సెనేటర్ రాబర్ట్ ఎఫ్ కెనడీ హత్యలకు సంబంధించి ఇంతకాలం రహస్యంగా ఉన్న ఫైళ్లు బహిర్గతం కానున్నాయి. ఈ మేరకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కార్యనిర్వాహక ఆదేశాన్ని జారీ చేశారు. ఫైళ్లను బయటపెట్టేందుకు 15 రోజుల్లో ప్రణాళికను సమర్పించాలని డైరెక్టర్ ఆఫ్ నేషనల్ ఇంటెలిజెన్స్‌ను ఆదేశించారు. ఈ హత్యలకు సంబంధించిన నిజాలు బాధితుల కుటుంబాలు, అమెరికా ప్రజలకు తెలియజేయాలని, దశాబ్దాలుగా ప్రజలు ఎదురుచూస్తున్నారని డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు.

జన్మతః పౌరసత్వం రద్దు నిలిపివేత

తాత్కాలికంగా ఆపేసిన కోర్టు

అమెరికాలో జన్మించే వారికి సహజంగా వచ్చే జన్మతః పౌరసత్వాన్ని రద్దు చేస్తూ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ జారీ చేసిన కార్యనిర్వాహక ఆదేశాన్ని అమలు చేయకుండా న్యాయస్థానం తాత్కాలికంగా నిలిపివేసింది. అధ్యక్షుడి ఉత్తర్వును సవాల్ చేస్తూ పలు రాష్ట్రాలు దాఖలు చేసిన పిటిషన్‌ను గురువారం సియాటిల్ డిస్ట్రిక్ట్ జడ్జి జాన్ కాఫ్నర్ విచారించారు. 'ఇది స్పష్టంగా రాజ్యాంగ విరుద్ధమైన ఉత్తర్వు' అని ప్రభుత్వ న్యాయవాదిని ఉద్దేశించి న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. 14 రోజుల పాటు అధ్యక్షుడి కార్యనిర్వాహక ఆదేశాన్ని నిలిపివేస్తున్నట్టు ప్రకటించారు. న్యాయమూర్తి నిర్ణయంపై తన కార్యవర్గం అప్పీల్ చేస్తుందని డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు.

మూడో పర్యాయంపై ట్రంప్ కన్ను

అమెరికా అధ్యక్షుడిగా మరో పర్యాయం పని చేయాలని డొనాల్డ్ ట్రంప్ భావిస్తున్నారు. ఇందుకు వీలుగా రాజ్యాంగ సవరణ కోసం అడుగులు పడుతున్నాయి. ఈ మేరకు రిపబ్లికన్ పార్టీ చట్టసభ్యుడు ఆండీ ఓగ్లెస్ ఒక తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. 'డొనాల్డ్ ట్రంప్ మూడో పర్యాయం అధ్యక్షుడిగా పని చేయడానికి ఈ సవరణ వీలు కల్పిస్తుంది' అని ఈ సందర్భంగా ఆండీ పేర్కొన్నారు. ప్రస్తుతం అమెరికా రాజ్యాంగం ప్రకారం అధ్యక్షుడిగా ఒక వ్యక్తి రెండు పర్యాయాలకు మించి పని చేయడానికి అవకాశం లేదు.

ఖండాలు ఏడు కాదు, ఆరే!

- యూరోపా, ఉత్తర అమెరికాల మధ్య లింక్
- అట్లాంటిక్ మహాసముద్రంలో అనుసంధానం
- వాటిని కలుపుతున్న టెక్టోనిక్ ప్లేట్లు
- యూకే పరిశోధకుల అధ్యయనంలో వెల్లడి

లండన్: ప్రపంచంలో ఉన్న ఖండాలెన్ని అని అడిగితే ఠక్కున ఏడు అని అందరూ సమాధానం చెబుతారు. కానీ, భవిష్యత్తులో ఆరు అని చెప్పాల్సి రావచ్చు. ఎందుకంటే, ప్రపంచంలో ఉన్న ఖండాలు ఏడు కాదు, ఆరు మాత్రమేనని బ్రిటన్‌కు చెందిన ఓ యూనివర్సిటీ పరిశోధకులు ప్రతిపాదించారు. యూనివర్సిటీ ఆఫ్ డెర్బీకి చెందిన ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ విభాగం పరిశోధకులు ఈ మేరకు తమ అధ్యయనంలో కనుగొన్నట్టు వెల్లడించారు. అట్లాంటిక్ మహాసముద్రం కింది భాగంలో టెక్టోనిక్ ప్లేట్ల ద్వారా ఇప్పటికీ ఉత్తర అమెరికా, యూరేషియా (యూరప్+ఆసియా) అనుసంధానమై ఉన్నాయని పరిశోధకులు ప్రతిపాదించారు. ప్రధానంగా ఐస్‌లాండ్ భౌగోళిక స్థితిగతులపై ఈ అధ్యయనం దృష్టి పెట్టింది. అందులో భాగంగా ఈ కీలకమైన విషయం వెల్లడైంది. తమ అధ్యయనంలో భౌగోళిక లక్షణాలు కలిగిన రిఫ్టెడ్ ఓషియన్ మాగ్మాటిక్ ప్లాటో (పీఠభూమి)ని పరిశోధకులు గుర్తించారు. అది సముద్ర అంతర్భాగంలో దాగి ఉన్న ఉపఖండాన్ని సూచిస్తున్నదని పరిశోధకులు భావిస్తున్నారు. ఐస్‌లాండ్, గ్రీన్‌లాండ్-ఐస్‌లాండ్-ఫారోస్ రిడ్జ్ కలిసి ఉత్తర అమెరికా, యూరప్‌లను అనుసంధానం చేసే భారీ నిర్మాణాన్ని ఏర్పరుస్తున్నట్టు పరిశోధకులు భావిస్తున్నారు. ఈ పరిశోధనలు నిజమైతే ఖండాల భౌగోళిక స్థితిగతులను పునర్నిర్వచించడంతో పాటు ప్రపంచ మ్యాప్‌నే మార్చేస్తుంది.

బ్రిటిష్ ద్వీపంవైపు దూసుకొస్తున్న

భారీ మంచుకొండ

ముంబై కంటే ఆరు రెట్లు అధిక విస్తీర్ణం

దక్షిణ జార్జియాను ఢీకొనబోతున్న 'ఏ23ఏ'

న్యూఢిల్లీ, జనవరి 24: ప్రపంచంలోనే అతిపెద్దదైన 'ఏ23ఏ' ఐస్‌బర్గ్ (మంచు కొండ) బ్రిటిష్ భూభాగం వైపు దూసుకొస్తున్నది. అంటార్కిటికా నుంచి విడిపోయి అట్లాంటిక్ మహా సముద్రంలో కొట్టుకొస్తున్న ఈ భారీ హిమ పర్వతం ముందు దక్షిణ జార్జియా ద్వీపాన్ని ఢీకొనే అవకాశం కనిపిస్తున్నది. ప్రస్తుతం ఆ ప్రాంతానికి 280 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ ఐస్‌బర్గ్ బలమైన గాలులు, సముద్ర ప్రవాహాల ప్రభావం వల్ల ముందుకు కదులుతున్నది. దీని గమనంపై శాస్త్రవేత్తలు చాలా కాలం నుంచి దృష్టి సారించారు. పశ్చిమ అంటార్కిటికాలోని ఫిల్చ్‌నర్-రోన్ ఐస్ షెల్ఫ్ నుంచి విడిపోయిన ఈ హిమ పర్వతం గత 37 ఏండ్ల నుంచి స్థిరంగా కొనసాగుతున్నది. దాదాపు 4 వేల చదరపు కిలోమీటర్ల వైశాల్యాన్ని కలిగివున్న ఈ హిమఖండం పరిమాణంలో మన ముంబై నగరం కంటే ఆరు రెట్లు పెద్దది. లక్షల కోట్ల టన్నుల బరువు ఉండే ఈ మంచు ఫలకాన్ని 'మెగాబర్గ్' అని పిలుస్తున్నారు. గత రెండేండ్ల నుంచి నీటిపై తేలియాడుతున్న ఈ ఐస్‌బర్గ్ సమీప భవిష్యత్తులో దక్షిణ జార్జియా ద్వీపాన్ని ఢీకొని, అక్కడే చిక్కుకుపోయే అవకాశం కనిపిస్తున్నది. ఇదే జరిగితే ఆ ఐస్‌బర్గ్‌పై ఉన్న పెంగ్విన్లు తమ పిల్లలకు ఆహారాన్ని అందించడం కష్టమవుతుంది. కొన్ని పిల్లలు ఆకలితో అలమటించవచ్చు.

జెన్నిఫర్‌తో ఒబామా డేటింగ్?

వాషింగ్టన్ : 'ఫ్రెండ్స్' స్టార్ జెన్నిఫర్ అనిస్టన్‌తో అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా డేటింగ్ చేస్తున్నట్టు వార్తలు గుప్పుమంటున్నాయి. బరాక్ ఒబామా, మిషెల్ ఒబామా దంపతుల మధ్య సత్సంబంధాలు దెబ్బతిన్నాయని, వారు విడాకులు తీసుకోబోతున్నారని ఇటీవల వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ఇదిలావుండగా, జెనిఫర్ ఫ్రెండ్ ఒకరి నుంచి లీక్ అయినట్లు చెప్తున్న సమాచారం ప్రకారం, ఒబామాతో డేటింగ్ గురించి జెనిఫర్ సన్నిహితులకు తెలుసు!.

2020లో ట్రంప్ గెలిచి ఉంటే..

యుద్ధం జరిగేది కాదు

రష్యా అధ్యక్షుడు పుతిన్

మాస్కో: డొనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్ష పదవిలో కొనసాగి ఉంటే, ఉక్రెయిన్‌తో యుద్ధం జరిగి ఉండేది కాదని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ అన్నారు. 2020 ఎన్నికల్లో తన గెలుపును దొంగిలించారని ట్రంప్ వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. రష్యన్ మీడియా శుక్రవారం వెల్లడించిన వివరాల ప్రకారం పుతిన్ మాట్లాడుతూ, ''ఆయనతో నేను ఏకీభవిస్తాను. ఆయన అధ్యక్షుడైతే, 2020లో జరిగిన ఎన్నికల్లో ట్రంప్ గెలుపును ఆయన నుంచి దొంగిలించి ఉండకపోతే, 2022లో ఉక్రెయిన్‌లో వచ్చిన సంక్షోభం బహుశా ఉండి ఉండకపోవచ్చు' అని పుతిన్ చెప్పారు. ట్రంప్ తెలివైనవారు మాత్రమే కాదని, ఆచరణాత్మకంగా ఆలోచించి పని చేయగలిగే వ్యక్తి అని పుతిన్ ప్రశంసించారు. అమెరికా సాయంతో ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించడానికి చర్చలు జరపడానికి రష్యా సిద్ధమేనని ప్రకటించారు.

కరీనా పాత్రపైనా పోలీసుల దృష్టి

- ఘటన జరిగిన తీరుకు, ఆమె ఇచ్చిన సమాచారానికి పొంతన లేని వైనం
- కరీనా కపూర్‌ను ప్రశ్నించే అవకాశం

ముంబై, జనవరి 24(నమస్తే తెలంగాణ): బాలీవుడ్ నటుడు సైఫ్ అలీ ఖాన్‌పై దాడి కేసును పోలీసులు అన్ని కోణాల్లో విచారిస్తున్నారు. సైఫ్ కుటుంబసభ్యులు, ముఖ్యంగా ఆయన భార్య కరీనా కపూర్ పాత్రపైనా దర్యాప్తు చేస్తున్నారు. ఘటనపై కరీనా కపూర్ చెప్పిన వివరాలకు, ఘటన తీరుకు పొంతన కుదరలేదని తెలుస్తున్నది. సైఫ్‌పై దాడి జరిగిన సమయంలో కరీనా ఇంట్లోనే ఉంది. ఇంట్లోకి ఒక వ్యక్తి ప్రవేశించాడని, పనిమనిషిపై దాడి చేయడానికి ప్రయత్నించడంతో అతన్ని ప్రతిఘటించే క్రమంలో సైఫ్‌పై దాడి జరిగిందని కరీనా చెప్తూ వచ్చారు. దుండగుడిని గదిలో బంధించామని, తర్వాత అతడు తప్పించుకుపోయాడని పోలీసులకు చెప్పారు. అయితే, పోలీసులు సీన్ రీ క్రియేట్ చేయగా.. ఘటన తీరుకు, సైఫ్ ఇంట్లో వాళ్లు చెప్తున్న సమాచారానికి పొంతన లేదని తెలుస్తున్నది. కరీనా, పని మనిషిని వేర్వేరుగా విచారించి, తర్వాత ఇద్దరిని కలిపి విచారించాలని పోలీసులు భావిస్తున్నారు. అత్యంత భద్రతతో కూడిన అపార్ట్‌మెంట్‌లోకి కుటుంబ సభ్యులు లేదా పనివారి సాయం లేకుండా కొత్త వ్యక్తి ప్రవేశించే అవకాశం లేదనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

సైఫ్ కేసులో నా కొడుకును ఇరికించారు

నటుడు సైఫ్‌పై దాడి కేసులో పోలీస్ కస్టడీలో ఉన్న బంగ్లా దేశీయుడి తండ్రి తన కొడుకును అక్రమంగా ఈ కేసులో ఇరికించారని ఆరోపించారు. ఈ విషయమై తాను తమ దేశ ప్రభుత్వాన్ని, ఢాకాలోని భారత దౌత్య కార్యాలయాన్ని ఆశ్రయిస్తానని చెప్పారు.

వందో ప్రయోగానికి ఇస్రో సిద్ధం

29న నింగిలోకి జీఎస్ఎల్వీ-ఎఫ్15

బెంగళూరు: భారత అంతరిక్ష కార్యక్రమంలో మరో మైలురాయిని చేరుకోవడానికి ఇస్రో సిద్ధమైంది. ఈ నెల 29న శ్రీహరికోటలోని షార్ నుంచి తన వందో ప్రయోగమైన జీఎస్ఎల్వీ-ఎఫ్15 రాకెట్‌ను రోదసిలోకి పంపడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ రాకెట్ ద్వారా ఎన్వీఎస్-02 ఉపగ్రహాన్ని భారత్ అంతరిక్షంలోకి పంపనుంది. జీఎస్ఎల్వీ-ఎఫ్15 రాకెట్ జీఎస్ఎల్వీ సిరీస్‌లో 17వది, దేశీయ క్రయోజెనిక్ స్టేజ్ కలిగిన 11వ రాకెట్. ఈ ప్రయోగం ద్వారా ఎన్వీఎస్-02 ఉపగ్రహాన్ని జియోసింక్రనస్ ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్‌లోకి ప్రవేశపెట్టనున్నారు. దీని ద్వారా దేశీయ నావిగేషన్ వ్యవస్థ నావిక్ మరింత విస్తృతం కానున్నది.

దరఖాస్తుతోనే వయసు, కోటా ధ్రువపత్రాలు జతచేయాలి

- సివిల్స్‌కు కొత్త నిబంధన

న్యూఢిల్లీ, జనవరి 24: సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షలకు దరఖాస్తు చేసే సమయంలోనే అభ్యర్థులు తమ వయసు, రిజర్వేషన్‌కు సంబంధించిన పత్రాలను జతచేయడాన్ని కేంద్ర ప్రభుత్వం తప్పనిసరి చేసింది. ప్రభుత్వ సర్వీసుల్లో ఎంపికయ్యేందుకు మాజీ ఐఏఎస్ ప్రొబేషనర్ పూజా ఖేడ్కర్ ఓబీసీ సర్టిఫికెట్‌ను, వికలాంగ కోటా ప్రయోజనాలను దుర్వినియోగం చేయడంతోపాటు మోసానికి పాల్పడినట్టు ఆరోపణలు రావడంతో కేంద్రం ఈ చర్యలు చేపట్టింది.దరఖాస్తు ఫారమ్‌తోపాటు జత చేయాల్సిన పత్రాలను అప్‌లోడ్ చేయని పక్షంలో దరఖాస్తు రద్దయిపోతుందని నిబంధనలు పేర్కొన్నాయి.

8 ఫిట్జీ కేంద్రాల మూసివేత

సిబ్బందికి జీతాలు చెల్లించకపోవడం వల్లే

న్యూఢిల్లీ, జనవరి 24: దేశంలో పోటీ పరీక్షల కోచింగ్ సెంటర్‌గా పేరొందిన ఎఫ్ఐఐటీజేఈఈ (ఫిట్జీ)ఉత్తర భారత ప్రాంతంలో సుమారు 8 కోచింగ్ సెంటర్లను అకస్మాత్తుగా మూసివేసింది. ఒక వైపు బోర్డు పరీక్షలు, మరో పక్క పోటీపరీక్షలు ముంచుకొస్తున్న వేళ చోటుచేసుకున్న ఈ హఠాత్ పరిణామంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. ఇందులో పనిచేస్తున్న అధ్యాపకులు, సిబ్బందికి జీతాలు చెల్లించడం లేదని, దాంతో వారు మూకుమ్మడిగా రాజీనామాలు చేయడంతో ఈ పరిస్థితి తలెత్తింది.

మహారాష్ట్ర ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో పేలుడు

- 8 మంది కార్మికులు మృతి
- ఐదుగురికి గాయాలు
- శిథిలాల కింద మరికొందరు

ముంబై, జనవరి 24(నమస్తే తెలంగాణ): మహారాష్ట్రలో శుక్రవారం ఘోర దుర్ఘటన సంభవించింది. భండారా జిల్లాలోని ఓ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో పేలుడు సంభవించి 8 మంది మరణించినట్టు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ప్రకటించారు. ప్రాథమిక సమాచారం ప్రకారం శుక్రవారం ఉదయం జరిగిన ఈ పేలుడులో 8 మంది వ్యక్తులు మరణించగా మరో ఐదుగురు గాయపడ్డారని ఆయన తెలిపారు. ఇప్పటివరకు నాలుగు మృతదేహాలను వెలికితీశామని, గాయపడిన ఐదుగురు వ్యక్తులను రక్షించామని జిల్లా కలెక్టర్ సంజయ్ కోల్టే వెల్లడించారు. శిథిలాల కింద ఉన్న నలుగురు లేదా ఐదుగురు వ్యక్తుల కోసం సహాయక చర్యలు జరుగుతున్నాయని చెప్పారు. జవహర్ నగర్ వద్ద ఉన్న ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో ఉదయం 10.30 గంటల ప్రాంతంలో పేలుడు సంభవించినట్టు అధికారులు తెలిపారు. పేలుడు కారణంగా మంటలు చెలరేగి భవనం కూలిపోయిందని అధికారులు తెలిపారు.

జేపీసీ నుంచి 10 మంది విపక్ష ఎంపీల సస్పెన్షన్

- వక్ఫ్ ప్యానల్ సమావేశం రసాభాస
- చైర్మన్ తీరుపై విపక్ష సభ్యుల ఆగ్రహం

న్యూఢిల్లీ: వక్ఫ్ సవరణ బిల్లుపై ఏర్పడిన సంయుక్త పార్లమెంటరీ కమిటీ(జేపీసీ) సమావేశం శుక్రవారం వాడీవేడిగా సాగింది. జేపీసీ చైర్మన్ జగదంబికా పాల్ ప్రొసీడింగ్స్ ద్వారా తమపై ఒత్తిడి తీసుకువస్తూ ఇష్టారీతిగా అజెండాను మార్చేస్తున్నారని ఆరోపిస్తూ ప్రతిపక్ష సభ్యులు నిరసన తెలియజేయడంతో సమావేశానికి హాజరైన 10 మంది ప్రతిపక్ష సభ్యులను ఒకరోజు పాటు సస్పెండ్ చేస్తున్నట్టు చైర్మన్ ప్రకటించారు. ప్రొసీడింగ్స్‌ని ఓ ప్రహసనంగా మార్చేసిన చైర్మన్ జగదంబికా పాల్ ప్రభుత్వ ఆదేశాల మేరకు వ్యవహరిస్తున్నారని ప్రతిపక్ష సభ్యులు జేపీసీ సమావేశంలో ఆరోపించారు. ఈ ఆరోపణలను ఖండించిన చైర్మన్ సమావేశాన్ని అడ్డుకోవడానికే సభ్యులు ఈ విధంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. జనవరి 21న జేపీసీ సమావేశం తర్వాత తదుపరి సమావేశం జనవరి 24-25న జరుగుతుందని చైర్మన్ తెలియచేశారని అంతకుముందు తృణమూల్ ఎంపీ కల్యాణ్ బెనర్జీ తెలిపారు. దీనికి ప్రతిపక్ష సభ్యులు అభ్యంతరం తెలిపారని, చైర్మన్ తమ మాటను వినకుండా శుక్రవారానికి సమావేశాన్ని ఖరారు చేశారని ఆయన తెలిపారు. శుక్రవారం సమావేశానికి చెందిన అజెండాను గురువారం రాత్రి మార్చి అర్ధ రాత్రి తమకు సమాచారం అందచేశారని ఆయన విమర్శించారు. ప్రతిపక్ష సభ్యులను చైర్మన్ పని మనుషుల్లాగా చూస్తూ ఆదేశాలు జారీ చేస్తున్నారని బెనర్జీ ఆరోపించారు.

జగదంబికా పాల్‌పై దర్యాప్తు జరపాలి

ఈనెల 27న జరగనున్న వక్ఫ్ సవరణ బిల్లుకు సంబంధించిన జేపీసీ సమావేశాన్ని వాయిదావేయాలని, నిష్పాక్షికంగా, పారదర్శకంగా సమావేశాలను నిర్వహించేలా జేపీసీ చైర్మన్ జగదంబికాపాల్‌ను ఆదేశించాలని కోరుతూ కమిటీలోని ప్రతిపక్ష సభ్యులు లోక్ సభ స్పీకర్‌కు శుక్రవారం లేఖ రాశారు.



బ్లడ్ క్యాన్సర్‌కు కొత్త చికిత్స

ఆమోదం తెలిపిన సీడీఎస్‌సీఓ

న్యూఢిల్లీ, జనవరి 24: బ్లడ్ క్యాన్సర్ బాధితులకు చికిత్స అందించేందుకు దేశంలో కొత్త చికిత్సకు సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్(సీడీఎస్‌సీఓ) ఆమోదం తెలిపింది. బెంగళూరుకు చెందిన బయోటెక్ స్టార్టప్ అయిన ఇమునీల్ థెరప్యూటిక్స్ అనే సంస్థ కార్టెమీ అనే జీవ ఔషధాన్ని తయారు చేసింది. ఇది సీఏఆర్-టీ సెల్ థెరపీ. బీ-ఎన్‌హెచ్ఎల్ అనే బ్లడ్ క్యాన్సర్ బాధితుల చికిత్సకు దీనిని ఉపయోగిస్తారు. దేశంలో వినియోగానికి ఆమోదం పొందిన రెండో సీఏఆర్-టీ సెల్ థెరపీ ఇది. సాధారణ రసాయన ఔషధానికి ఈ జీవ ఔషధం భిన్నమైనది. రోగ నిరోధక వ్యవస్థ దీర్ఘకాలం ఉండేలా కణాలతో రసాయన ఔషధాన్ని తయారుచేస్తారు. జీవ ఔషధం ఇందుకు భిన్నంగా ఉంటుంది. రోగి నుంచి టీ-సెల్స్‌ను తీసుకొని క్యాన్సర్ కణాలపై దాడి చేసేలా జన్యు ఇంజినీరింగ్ చేసి మళ్లీ రోగిలోకి పంపిస్తారు. ఈ చికిత్సకు రూ.35 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు ఖర్చు అవుతుందని ఇమునీల్ థెరప్యూటిక్స్ సంస్థ తెలిపింది.

అదానీకి శ్రీలంక షాక్

- విద్యుత్తు కొనుగోలు ఒప్పందం రద్దు
- అవినీతి ఆరోపణల నేపథ్యంలో నిర్ణయం
- ఆరోపణలను ఖండించిన అదానీ సంస్థ

న్యూఢిల్లీ, జనవరి 24: శ్రీలంకలో అదానీ గ్రూప్‌నకు భారీ ఎదురుదెబ్బ తగిలింది. గతంలో అదానీ సంస్థతో చేసుకున్న విద్యుత్తు కొనుగోలు ఒప్పందాన్ని శ్రీలంక ప్రభుత్వం రద్దు చేసుకుంది. అదానీ సంస్థ నుంచి విద్యుత్తును కొనుగోలు చేసేందుకు గత ఏడాది మేలో శ్రీలంకలోని అప్పటి ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకున్నది. కిలోవాట్‌కు రూ.7.13 చొప్పున విద్యుత్తు కొనుగోలుకు ఒప్పందం జరిగింది. విద్యుత్తు సరఫరా కోసం ఆ దేశంలోని మన్నార్, పూనెరిన్‌లో 484 మెగావాట్ల పవన విద్యుత్కేంద్రం నిర్మించాలని అదానీ సంస్థ ప్రణాళిక రూపొందించింది. అయితే, అదానీ సంస్థ సరఫరా చేస్తానని ఒప్పందం కుదుర్చుకున్న ధర కంటే చాలా తక్కువ ధరకు కొన్ని సంస్థలు విద్యుత్తును సరఫరా చేస్తున్నాయని పలువురు వాదించారు. మరోవైపు అదానీ సంస్థ విద్యుత్తు ఒప్పందాల కోసం లంచాలు ఇచ్చిందని గత ఏడాది నవంబర్ 19న అమెరికాలో అభియోగాలు నమోదయ్యాయి.

ఆరోపణల నేపథ్యంలోనే నిర్ణయం

ఆరోపణల నేపథ్యంలో అధ్యక్షుడు అనుర కుమార దిస్సనాయకె నేతృత్వంలోని శ్రీలంక కొత్త ప్రభుత్వం అదానీతో విద్యుత్తు కొనుగోలు ఒప్పందాన్ని రద్దు చేసుకోవాలని తాజాగా నిర్ణయించింది. అయితే, విద్యుత్కేంద్రం నిర్మాణ ప్రాజెక్టును మాత్రం రద్దు చేయలేదని, ఈ మొత్తం ప్రాజెక్టును సమీక్షించేందుకు మంత్రివర్గం ఒక కమిటీని నియమించిందని ఓ ప్రభుత్వ అధికారి తెలిపారు. ఈ వార్తలపై అదానీ సంస్థ స్పందించింది. విద్యుత్కేంద్రం నిర్మాణ ప్రాజెక్టు రద్దు కాలేదని, విద్యుత్తు కొనుగోలు కోసం ఆమోదించిన టారిఫ్‌ను సమీక్షించాలని మాత్రమే కొత్త ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని చెప్పింది.

కొత్త వ్యవసాయ మార్కెటింగ్ విధానం మాకొద్దు

మార్చి నుంచి దేశవ్యాప్త నిరసనలకు ఎస్‌కేఎం పిలుపు

న్యూఢిల్లీ: జాతీయ వ్యవసాయ మార్కెటింగ్ విధాన రూపకల్పన (ఎన్‌పీఎఫ్ఏఎం)ను సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) ఏకగ్రీవంగా తిరస్కరించింది. ఇవి మూడు వ్యవసాయ చీకటి చట్టాలకు పునర్జన్మలా ఉందని, దీనికి వ్యతిరేకంగా అన్ని రాష్ట్రాల్లో పక్కా మోర్చా (బైఠాయింపు నిరసన)లు నిర్వహించనున్నట్టు తెలిపింది. సుర్జీత్ భవనంలో జరిగిన ఎస్‌కేఎం సర్వ సభ్య సమావేశం అనంతరం సంఘం ఈ ప్రకటన చేసింది. 12 రాష్ట్రాల నుంచి 73 రైతు సంఘాలకు చెందిన 165 మంది ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ విధానం ప్రభుత్వ మార్కెట్లపై క్రూరమైన దాడిగా వర్ణించిన నేతలు ఇవి కేవలం ఎంఎన్‌సీ, కార్పొరేట్లకు మాత్రమే ప్రయోజనాన్ని కలిగిస్తాయని ఆరోపించారు. ఈ విధానం రైతు, రాష్ట్ర ప్రభుత్వ వ్యతిరేకిగా ఉందని ఎస్‌కేఎం పేర్కొంది. దీనికి నిరసనగా తమ ఆందోళన తర్వాతి దశలో భాగంగా మార్చి 5 నుంచి దేశవ్యాప్తంగా బైఠాయింపు నిరసనలను చేపట్టాలని పిలుపునిచ్చింది.

అమూల్ లీటరు పాల ప్యాకెట్‌పై

రూపాయి తగ్గింపు

హైదరాబాద్, జనవరి 24 (నమస్తే తెలంగాణ): దేశంలోనే అతిపెద్ద పాల ఉత్పత్తి సంస్థ అమూల్ కీలక నిర్ణయం తీసుకున్నది. అమూల్ గోల్డ్, అమూల్ తాజా, అమూల్ టీ స్పెషల్ లీటరు పాల ప్యాకెట్‌పై రూపాయి తగ్గించింది. తాజా నిర్ణయంతో లీటర్ అమూల్ గోల్డ్ పాల ధర రూ.66 నుంచి రూ.65కి, అమూల్ టీ స్పెషల్ మిల్క్ లీటర్ ప్యాకెట్ ధర రూ.61కి, అమూల్ తాజా పాల ధర లీటరు రూ.54 నుంచి రూ.53కి తగ్గింది. కొత్త ధరలు వెంటనే అమల్లోకి వస్తాయని సంస్థ ప్రకటించింది. కాగా, అమూల్ గత ఏడాది జూన్‌లో పాల ధరలను లీటరుకు రూ.2 పెంచిన విషయం తెలిసిందే.

మర్రి, వేపతో కాలుష్యానికి చెక్

గుర్తించిన పరిశోధకులు



హైదరాబాద్, జనవరి 24: భాగ్యనగరంలో రోజురోజుకూ కాలుష్యం పెరిగిపోతున్నది. దీనికి అడ్డుకట్ట వేయడానికి ఫారెస్ట్ బయోడైవర్సిటీ పరిశోధకులు ఒక కొత్త విరుగుడును కనిపెట్టారు. దుమ్ము, వాయు కాలుష్యాన్ని సమర్థంగా అరికట్టడానికి కొన్ని జాతుల వృక్షాలు ప్రముఖ పాత్ర పోషిస్తాయని వీరు గుర్తించారు. ముఖ్యంగా మర్రిజాతి చెట్టు ఈ విషయంలో ముందుంటుందని ఆ పరిశోధన తేల్చింది. ఈ కోవలో వేప, ఆర్కిడ్, కానుగ చెట్లు సైతం కాలుష్య స్థాయిని తగ్గించడంలో ప్రముఖంగా వ్యవహరిస్తాయని నిర్ధారించింది. ఈ జాతుల చెట్లు దుమ్మును అడ్డుకుంటాయని, గాలిలోని ధూళిని తట్టుకుని ఎదగగలవని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారెస్ట్ బయో డైవర్సిటీ పరిశోధన తేల్చింది. ఈ పరిశోధనను పంకజ్ సింగ్, భారతీ పటేల్‌లు నిర్వహించారు. మర్రి, వేప, ఆర్కిడ్, కానుగ చెట్లు వాయు కాలుష్య నియంత్రణలో చక్కని పాత్ర పోషించినట్టు గుర్తించారు.

ఆకాశం నుంచి అరచేతిలోకి సిగ్నల్

- సాధ్యం చేసే ప్రయత్నాల్లో ఎలాన్ మస్క్ స్టార్‌లింక్
- 27 నుంచి 'శాటిలైట్-టు-సెల్' టెక్నాలజీ పరీక్షలు
- సమాచార సాంకేతికలతో సరికొత్త విప్లవానికి శ్రీకారం



న్యూయార్క్: దట్టమైన అడవైనా, మారుమూల ప్రాంతమైనా.. భీకర తుఫానులోనైనా, పెను విపత్తులోనైనా... ఎక్కడైనా, ఎలాంటి అత్యవసర స్థితిలోనైనా సెల్‌ఫోన్‌కు సిగ్నల్ అందే రోజులు రానున్నాయా? భూమిపైన ఉండే సెల్ టవర్లతో సంబంధం లేకుండా నేరుగా ఆకాశం నుంచి అరచేతిలోని సెల్‌ఫోన్‌కు సిగ్నల్ అందనుందా? అంటే అవుననే అంటున్నది ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌కు చెందిన స్టార్‌లింక్ సంస్థ. సమాచార సాంకేతికలతో సరికొత్త విప్లవంగా భావిస్తున్న 'శాటిలైట్-టు-సెల్‌ఫోన్' సాంకేతికతను ఈ సంస్థ అభివృద్ధి చేసింది. దీనిని 'డైరెక్ట్-టు-సెల్' అని కూడా పిలుస్తున్నారు. జనవరి 27 నుంచి టెక్నాలజీ పరీక్షలు నిర్వహించనున్నట్టు ఎలాన్ మస్క్ శుక్రవారం 'ఎక్స్'లో ప్రకటించారు. బీటా పరీక్షలు విజయవంతమైతే ఈ సాంకేతికత త్వరలో అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

ఉపగ్రహం నుంచే సెల్‌ఫోన్ సిగ్నల్

ప్రస్తుతం ఉన్న సాంకేతికత ప్రకారం మొబైల్ టవర్ల ద్వారా సెల్‌ఫోన్‌లకు సిగ్నల్ అందుతుంది. టవర్లు లేని మారుమూల ప్రాంతాల్లో సిగ్నల్ ఉండదు. ఏవైనా ప్రకృతి విపత్తులు, అత్యవసర పరిస్థితులు తలెత్తినప్పుడు సిగ్నల్ వ్యవస్థ స్తంభించిపోతుంది. ఇప్పుడు 'శాటిలైట్-టు-సెల్‌ఫోన్' సాంకేతికతలో మొబైల్ టవర్ల అవసరం ఉండదు. దిగువ భూకక్ష్యలో ఉండే ఉపగ్రహాల నుంచి నేరుగా సెల్‌ఫోన్‌లకు సిగ్నల్ అందుతుంది. ఈ సిగ్నల్‌తో మెసేజ్‌లు, కాల్స్, డాటా సేవలు అందుతాయి. భూమిపైన ఏ మూలకైనా సిగ్నల్ వెళ్తుంది. ఎలాంటి విపత్తులు తలెత్తినా సిగ్నల్‌కు అంతరాయం ఉండదు. అత్యవసర పరిస్థితుల్లో, విపత్తుల సమయాల్లో ప్రాణనష్టం తగ్గించడానికి ఈ సాంకేతికత ఉపయోగపడుతుంది. అత్యవసర సమాచార వ్యవస్థను ఉచితంగానే అందుబాటులోకి తీసుకొస్తామని స్టార్‌లింక్ సంస్థ చెబుతున్నది.

ఐఐటీ బాంబేకు 95 కోట్ల విరాళం

అందజేసిన పూర్వ విద్యార్థి దంపతులు

ముంబై, జనవరి 24: ఐఐటీ బాంబేలో చదివి జీవితంలో ఉన్నత స్థానాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థి దంపతులు తమకు విద్యా దానం చేసిన సంస్థకు రూ.95 కోట్లను విరాళంగా అందజేశారు. విద్య, ఆవిష్కరణ రంగాల్లో ఐఐటీ బాంబే అమలు చేయనున్న కొత్త ఆలోచనల కోసం తమ విరాళాన్ని ఖర్చు చేయాలని జితేంద్ర మోహన్ (ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్, 1994 బ్యాచ్), స్వప్న సమంత్(సివిల్ ఇంజినీరింగ్, 1995 బ్యాచ్) సూచించారు. ఈ దంపతులు ఇచ్చిన విరాళంతో స్టెమ్ కోర్సుల్లో మహిళా అధ్యాపకులకు మద్దతుగా నిలిచి వారి సాధికారతకు తోడ్పడటం కోసం ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్‌లో విద్య శర్మ చైర్ ప్రొఫెసర్‌షిప్‌ను ఏర్పాటు చేయనున్నారు.